


# కరపత్రం

SINCE 2014

సోమవారం సెప్టెంబర్ 07, 2026 | సంపుటి : 2 | సంచిక : 327 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4





## త్వరలోనే ప్రజల్లోకి వస్తా..
# నదీ జలాలపై యుద్ధం చేస్తా

- లక్ష మంది రైతులతో పాదయాత్ర
- కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టుల సందర్శన
- బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం
- కాంగ్రెస్ 1000 రోజుల పాలన అట్టర్ ఫ్లాప్
- రేవంత్ హయాంలో తెలంగాణ ఫాలింగ్
- ప్రజా సమస్యలపై అసెంబ్లీలో పోరాటం

**హైదరాబాద్:**
బీఆర్ఎస్ ఎల్పీ సమావేశంలో గులాబీ బాస్, మాజీ సీఎం కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే ప్రజల్లోకి వస్తానని.. నదీ జలాల విషయంలో అవసరమైతే యుద్ధం చేస్తానని సంచలన ప్రకటన చేశారు. లక్ష మంది రైతులతో కలిసి పాదయాత్రగా వెళ్లి కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులను సందర్శిస్తానని తెలిపారు. తెలంగాణలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం 100 శాతం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణవార్తలు
సోమవారం (సెప్టెంబర్ 7) నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం (సెప్టెంబర్ 6) ఎర్రవల్లిలో కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్?ఎల్పీ సమావేశం జరిగింది. అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరూ తప్పకుండా హాజరు కావాలని సూచించారు. శాసన సభ, మండలిలో జరిగే ప్రతి చర్చలో పాల్గొనాలని.. అసెంబ్లీ సమావేశాలను ఎవరూ తేలిగ్గా తీసుకోవద్దని దిశానిర్దేశం చేశారు. ఉభయ సభల్లోనూ కాంగ్రెస్, బీజేపీ విధానాలను ఎండగట్టాలన్నారు. స్పీకర్ పక్షపాత ధోరణి.. అప్రజాస్వామిక విధానాలు ఎండగట్టాలని సూచించారు.
ఉభయ సభల్లోనూ ప్రజా సమస్యలపపై ప్రభుత్వాన్ని నిలదీయాలని సూచించారు. అసెంబ్లీలో ప్రజల అజెండానే బీఆర్ఎస్ అజెండాగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రతిపక్షంలో ఉన్న తమకు సంఖ్యాబలమే ముఖ్యమని పేర్కొన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని.. ఆ విషయాన్ని అసెంబ్లీలో చెప్పే బాధ్యత ప్రతిపక్ష ఎమ్మెల్యేలదేనని అన్నారు. అసెంబ్లీ సమావేశాలను 20 నిర్వహించాలని బీఏసీ మీటింగ్ లో పట్టుబట్టాలని సూచించారు.

**కాంగ్రెస్ 1000 రోజుల పాలన అట్టర్ ఫ్లాప్:**
కాంగ్రెస్ 1000 రోజుల పాలన, సీఎం రేవంత్ రెడ్డిపై కేసీఆర్ ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ 1000 రోజుల పాలన డిజాస్టర్, అట్టర్ ఫ్లాప్ అని అభివర్ణించారు.

మిగతాద్ది 2 లో

## గ్రామ నిధులు నేరుగా సర్పంచులకే అందేలా త్వరలో కొత్త బిల్లు: మంత్రి సీతక్క



2 లో

- » గ్రామ నిధులు నేరుగా సర్పంచులకే
- » త్వరలో కొత్త బిల్లు: సీతక్క
- » నిధుల విడుదలలో ఇబ్బందులకు చెక్
- » సర్పంచులకు మానసిక స్థైర్యం అవసరం
- » గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- » నైతిక విలువలకు సర్పంచులే నాయకత్వం

**గచ్చిబౌలి:**
గ్రామ సర్పంచులు నిత్యం ఎదురయ్యే ఒత్తిళ్లు, విమర్శలను తట్టుకొని మానసిక స్థైర్యంతో ముందుకు సాగాలని మంత్రి సీతక్క అన్నారు. నిధుల విడుదల విషయంలో ఉప సర్పంచుల చెక్ పవర్‌కు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో వచ్చిన చట్టంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నారు. ఈ అంశాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు మంత్రి తెలిపారు. గ్రామాలకు అభివృద్ధి నిధులు ఆగిపోకుండా.. నిధులు నేరుగా సర్పంచులకే అందేలా త్వరలో అసెంబ్లీలో కొత్త బిల్లు ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. ఆదివారం గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్‌లో సర్పంచుల కోసం 'సమర్థవంతమైన నాయకత్వం ద్వారా గ్రామ ప్రగతి' అనే అంశంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## ప్రతిపక్ష నేత హోదాకు
# కేసీఆర్ న్యాయం చేయాలి

- అసెంబ్లీకి రాకపోతే పదవి మరొకరికి ఇవ్వాలి
- ప్రజా తీర్పును అపహాస్యం చేయొద్దు
- ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్
- తెలంగాణలో 'నీళ్లు--నిధులు--నియామకాలు' కుటుంబానికే దక్కాయి
- పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు: మహేశ్‌కుమార్‌గౌడ్
- ప్రతి నియోజకవర్గానికి 2,500 ఇళ్లు మంజూరు
- ప్రభుత్వ విద్య, వైద్య రంగాల బలోపేతం
- ఆర్థిక ఇబ్బందుల్లోనూ సంక్షేమం కొనసాగింపు



2 లో

**హైదరాబాద్:**
ప్రజలు ఇచ్చిన ప్రతిపక్ష నేత హోదాకు మాజీ సీఎం కేసీఆర్ న్యాయం చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఎమ్మెల్యే పదవికి కేసీఆర్ రాజీనామా చేయాలంటూ ఇందిరాపార్క్ వద్ద పీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాలో ఆయన మాట్లాడారు.



## "పెంపుడు జంతువుల కోసం ఖర్చు చేసే డబ్బు కంటే తక్కువ"

**న్యూఢిల్లీ:**
ఆశ్రమ పాఠశాలల్లో మృతి చెందిన ఆదివాసీ విద్యార్థుల కుటుంబాలకు మహారాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పరిహారంపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మండిపడ్డారు. ఆ పరహారం కొంతమంది రాజకీయ నాయకులు

2 లో



## అంబేద్కర్ సాంస్కృతిక కేంద్రానికి శంకుస్థాపన

- ఇబ్రహీంపట్నంలో కేంద్రం నిర్మాణం
- శంకుస్థాపన చేసిన మంత్రి వివేక్ వెంకటస్వామి
- నిధుల కోసం సహకరిస్తాం: వివేక్
- అంబేద్కర్ ఆశయాలే స్ఫూర్తి
- సామాజిక సమానత్వం, విద్యకు ప్రాధాన్యం

రంగారెడ్డి జిల్లా ఇబ్రంహీంపట్నం మండలంలోఅంబేద్కర్ సాంస్కృతిక కేంద్రానికి శంకుస్థాపన చేశారు మంత్రి వివేక్ వెంకటస్వామి. 2026 సెప్టెంబర్ 06న అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ, హైదరాబాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు

## కవితపై అసభ్య వ్యాఖ్యలు.. కానిస్టేబుల్‌పై చర్యలు

- » కానిస్టేబుల్‌ను అరెస్ట్ చేయాలి: కవిత
- » సస్పెన్షన్ కాదు.. కేసు పెట్టాలి
- » డీజీపీ తీరుపై కవిత ఆగ్రహం
- » చర్యలు లేకుంటే అంతర్జాతీయ వేదికలపై ఎండగడతా



మిగతాది 2లో

## బీఆర్ఎస్ వైఖరి మారకపోతే..
# మరో పదేళ్లు రోడ్లపైనే

- అసెంబ్లీకి వస్తే సమాధానం చెప్తాం: శ్రీధర్‌బాబు
- కేసీఆర్ సభకు వచ్చి అనుభవం పంచుకోవాలి
- విపక్షాల సోషల్ మీడియా విషప్రచారాన్ని తిప్పికొట్టాలి
- రైతుల ఖాతాల్లో రూ.1.60 లక్షల కోట్లు జమ చేశాం
- ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేస్తాం
- రూ.8 లక్షల కోట్ల అప్పు రాష్ట్రాన్ని అప్పగించారు
- అప్పులు చెల్లిస్తూనే సంక్షేమం కొనసాగిస్తున్నాం
- బీఆర్ఎస్ పదేళ్లలో ఒక్కసారి కూడా గ్రేడ్--1 నియామకాలు లేవు



మిగతాది 2లో



## తీవ్ర విషాదం.. కల్తీ మద్యం సేవించి 10 మంది మృతి

**భోపాల్:**
మధ్యప్రదేశ్‌లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. సాగర్ జిల్లాలో కల్తీ మద్యం సేవించి పదిమంది మృతిచెందారు. మృతులంతా అక్కడి ఘూఘర్, నౌరాజ్, బరాజ్ తదితర గ్రామాలకు చెందినవారిగా అధికారులు గుర్తించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణచేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

2 లో




## పొన్నం సత్తయ్య జీవిత సాఫల్య పురస్కారాలకు ముగ్గురు ఎంపిక

- » వ్యవసాయం: ఎం. కోదండరెడ్డి
- » సాహిత్యం: వెలిచాల కొండలరావు
- » కళలు: గొట్టే కనకవ్వ
- » తొలిసారిగా వ్యవసాయ రంగానికి అవార్డు
- » ఈ నెల 13న రవీంద్రభారతిలో పురస్కారాల ప్రదానం
- » ముగ్గురికీ రూ.50 వేల నగదు పురస్కారం
- » మెమెంటో, ప్రశంసాపత్రంతో సత్కారం
- » సత్తయ్య ఆశయాలకు అనుగుణంగా ప్రతిభావంతులకు గౌరవం

2లో..



## "మా అమ్మ ఏం తప్పు చేసింది?"

- కన్నీరు పెట్టుకున్న సుస్మిత
- సురేఖను ఎందుకు అవమానించారు?
- "నా తప్పుకి నన్ను శిక్షించాలి"
- రేవంత్‌పై సుస్మిత తీవ్ర ఆరోపణలు
- "మా అమ్మ, నాన్న కాంగ్రెస్‌లోనే"

కొండా సురేఖ భర్తరఫ్ వ్యవహారంపై ఆమె కూతురు కొండా సుస్మిత స్పందించారు. మంత్రి పదవి నుంచి తొలగించడంపై 2026 సెప్టెంబర్ 6న వీడియో రిలీజ్ చేశారు. తన తల్లి ఏం తప్పు చేసిందని ఇంత అవమానించారంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. రాజకీయవార్తలు చదవండి అమ్మా, నాన్నా నన్ను క్షమించండి అంటూ కన్నీళ్లు పెట్టుకుంటూ భోరున ఏడ్చిన వీడియో రిలీజ్ చేశారు కొండా సుస్మిత . పార్టీలో నేనైనా ఉండాలి, ఆమె అయినా ఉండాలి అనే స్థాయికి ఒక ముఖ్యమంత్రి దిగజారుతాడా?

మిగతాద్ది 2 లో

# అసెంబ్లీ వ్యూహం ఖరారు

- కాంగ్రెస్ ద్రోహాలపై సభలో నిలదీస్తాం
- అసెంబ్లీ నెలరోజులు జరపాలి
- కేసీఆర్‌పై మాట్లాడే హక్కు మీకు లేదు
- కాళేశ్వరం, రంగారెడ్డి ఎత్తిపోతలపై కార్యాచరణ
- స్పీకర్‌పై అవిశ్వాసానికి వెనకాడం



**సిద్ధిపేట:**
(సోమవారం, సెప్టెంబర్ 07వ తేదీ) ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో తమ పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలను ఖరారు చేసుకున్నామని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఈరోజు ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ఎల్పీ సమావేశం అనంతరం హరీష్ మీడియాతో మాట్లాడారు. అన్ని వర్గాలకు కాంగ్రెస్ నష్టం చేసిందని, ఆ పార్టీ ప్రజలకు చేసిన ద్రోహాల మీద అసెంబ్లీలో నిలదీస్తామన్నారు.

2లో..



## వికారాబాద్ హైవేపై ఆల్టో కారు, కాంక్రీట్ టిప్పర్ ఢీ.. పూర్తిగా కాలిపోయిన కారు..

వికారాబాద్ జిల్లా పరిగి మండలం గడిసింగాపూర్ సమీపంలోని చింతల్ చెరువు దగ్గర బీజాపూర్ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. 2026 సెప్టెంబర్ 06వ తేదీన ఆల్టో కారు, టిప్పర్ లారీ బలంగా ఢీకొన్నాయి. ప్రమాద తీవ్రతకు కారులో ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగాయి. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురిలో నర్సింహులు అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు.

# పొన్నం సత్తయ్య జీవిత సాఫల్య పురస్కారాలకు ముగ్గురు ఎంపిక

మొదటిపేజీ తరువాయి
రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్య స్మారకార్థం ఏటా అందిస్తోన్న... పొన్నం సత్తయ్య జీవిత సాఫల్య పురస్కారాలకు ఈఏడాది ముగ్గురిని ఎంపిక చేసినట్లు పొన్నం సత్తయ్య ఛారిటబుల్ ట్రస్టు ప్రకటించింది. వ్యవసాయ రంగంలో విశేష కృషి చేస్తున్న రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి, సాహిత్య రంగంలో వెలిచాల కొండలరావు, కళారంగంలో విశేష సేవలందిస్తున్న గొట్టే కనకవ్వలను ఈ ఏడాది జీవిత సాఫల్య పురస్కారాలకు ఎంపిక చేసినట్లు ట్రస్టు ఉపాధ్యక్షులు పొన్నం అశోక్ గౌడ్ తెలిపారు.
అవార్డుల జ్యూరీ కమిటీ కన్వీనర్ డా. పొన్నం రవిచంద్ర సారథ్యంలో కేంద్ర సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్, ప్రముఖ పాత్రికేయులు దిలీప్ రెడ్డి, సివిల్ సప్లయిస్ డైరెక్టర్ జి.వి. శ్యాంప్రసాద్ లాల్, బి.సి. స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, రచయిత్రి అయినంపుడి శ్రీలక్ష్మి సభ్యులుగా ఉన్న జ్యూరీ కమిటీ అవార్డులకు ఎంపిక చేసిన జాబితాను (ఆదివారం) ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ పొన్నం ప్రభాకర్ కు అందజేసింది.
గత నాలుగు సంవత్సరాలుగా సాహిత్య రంగంలో నాలేశ్వరం శంకరం, నలిమెల భాస్కర్, చంద్రబోస్, అంపశయ్య నవీన్లకు, కళారంగంలో ఒగ్గు ధర్మయ్య, కామ్రేడ్ విమలక్క, బలగం కొమురమ్మ, అంతడుపుల రమాదేవిలకు పొన్నం సత్తయ్య జీవిత సాఫల్య పురస్కారాలను అందజేశారు. ఈ ఏడాది నుంచి వ్యవసాయ రంగాన్ని కూడా పురస్కారాల పరిధిలోకి తీసుకువచ్చి తొలిసారిగా వ్యవసాయ రంగంలో విశిష్ట సేవలందించిన వ్యక్తికి అవార్డును అందజేస్తున్నారు.
పొన్నం సత్తయ్య 16వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 13వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు రవీంద్రభారతిలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పొన్నం అశోక్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అవార్డులకు ఎంపికైన ముగ్గురికి రూ.50 వేల నగదు పురస్కారంతో పాటు మెమెంటో, ప్రశంసాపత్రం అందజేయనున్నట్లు వెల్లడించారు.

పొన్నం సత్తయ్య ఆశయాలను కొనసాగిస్తూ సమాజానికి వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న ప్రతిభావంతులను గుర్తించి గౌరవించడమే ఈ పురస్కారాల ప్రధాన ఉద్దేశ్యమని ఆయన తెలిపారు. ఈ అవార్డును పొన్నం సత్తయ్య ఛారిటబుల్ ట్రస్టు ఏటా అందజేస్తోంది.

# తీవ్ర విషాదం.. కల్తీ మద్యం సేవించి 10 మంది మృతి

మొదటిపేజీ తరువాయి
అయితే నిన్న శనివారం మద్యం సేవించిన అనంతరం బాధితుల ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించింది. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు వారిని ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే పరిస్థితి విషమించడంతో వారు మృతిచెందిట్లు వైద్యులు ప్రకటించారు. మరి కొంతమందికి చికిత్స అందిస్తున్నారు. అయితే ఈ మరణాలకు కల్తీ మద్యమే కారణమై ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నప్పటికీ, పోస్టుమార్టం నివేదికలు వచ్చే వరకు అధికారికంగా కారణాన్ని నిర్ధారించలేదు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

**యూపీ నుంచి కల్తీ మద్యం సరఫరా?**
ఈ ఘటనపై ప్రాథమిక దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. సాగర్‌కు సరిహద్దుగా ఉన్న ఉత్తరప్రదేశ్‌లోని లలిత్‌పూర్ కేంద్రంగా ఓ అక్రమ మద్యం సరఫరా నెట్‌వర్క్ పనిచేస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితులు లలిత్‌పూర్‌లో నకిలీ మద్యాన్ని తయారు చేసి, సాగర్ సరిహద్దు గ్రామాలకు తరలించినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం.

నకిలీ మద్యాన్ని అసలైన బ్రాండ్ల మాదిరిగా కనిపించేలా నకిలీ లేబుళ్లు, క్యాప్‌లు, క్యూఆర్ కోడ్‌లు ఉపయోగించినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. కార్లు, మోటార్‌సైకిళ్ల ద్వారా ఈ మద్యాన్ని వివిధ ప్రాంతాలకు తరలించినట్లు అనుమానిస్తున్నారు. బాంద్రీ, బరోడియా, ఘూఘూరా ఖుర్ద్, నౌరాజ్, బరాజ్ తదితర గ్రామాలకు ఈ నకిలీ మద్యం చేరినట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. మద్యం ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరెవరు సరఫరా చేశారు? స్థానికంగా ఎవరైనా ఈ అక్రమ నెట్‌వర్క్‌కు సహకరించారా? అనే కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నారు.

**ఘటనపై సీఎం సీరియస్**
సాగర్‌లో జరిగిన మరణాలపై మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తీవ్రంగా స్పందించారు. ఘటనాస్థలికి సంబంధిత మంత్రి, ఉన్నతాధికారులు వెళ్లి పరిస్థితిని పరిశీలించాలని ఆదేశించారు. పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

# అసెంబ్లీ వ్యూహం ఖరారు

మొదటిపేజీ తరువాయి
'ఈ అసెంబ్లీ కనీసం నెల పెట్టాలని మేము బీఏసీలో డిమాండ్ చేయబోతున్నాం. కాంగ్రెస్ పార్టీ ద్రోహాల మీద నిలదీస్తాం. 22ఖ అంశం పై కూడా ప్రభుత్వాన్ని నిలదీస్తాం. రాబోయే కొద్ది రోజుల్లో లక్షలాది మందితో కాళేశ్వరం ఎత్తిపోతల, రంగారెడ్డి ఎత్తిపోతల విషయంలో కేసీఆర్ ప్రత్యక్ష కార్యాచరణకు దిగనున్నారు. కేసీఆర్ గురించి మాట్లాడే నైతిక హక్కు మీకు లేదు.
రాజీనామా చేయాల్సి వస్తే మీరే చేయాలి. అన్ని విషయాల్లో ఫెయిల్ అయిన మీరే రాజీనామా చేయాలి. ప్రధాన ప్రతిపక్ష నేతకు గౌరవం ఇవ్వడం లేదు. సీఎం బూతులు తిడుతున్న ఈ సభ కు కేసీఆర్ రావాల్సిన అవసరం లేదు అని అందరం ఎమ్మెల్యేం చెప్పాం. మీ తమ్ముడు కనీసం వార్డు మెంబర్ కూడా కాదు. ఆయనకు ఎందుకు గన్‌మెన్‌లను ఇచ్చి ఖర్చు పెడుతున్నారు. అసెంబ్లీ కనీసం నెలరోజులు జరగాలని మేము స్పీకర్ ను కోరుతాం. సభలో మాకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను అడుగుతాం. మాకు తగిన సమయం ఇవ్వకపోతే స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి కూడా వెనకాడం' అని హెచ్చరించారు.

## త్వరలోనే ప్రజల్లోకి వస్తా..
# నదీ జలాలపై యుద్ధం చేస్తా

మొదటిపేజీ తరువాయి
తమ ప్రభుత్వం పోవడం ఖాయమని కాంగ్రెస్ నేతలకు అర్థమైందని.. అందుకే అడ్డగోలు దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు.

**సీఎం రేవంత్ పై కేసీఆర్ ఫైర్:**
ముఖ్యమంత్రి హోదాలో ఉన్న రేవంత్ రెడ్డి పాలన చేతకాక బూతులు మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ బూతుల వీరుడు చర్చలకు అసెంబ్లీకి నన్ను రమ్మంటున్నాడు. బూతులు మాట్లాడే వారితో చర్చించేందుకు నేను అసెంబ్లీకి రావడం అవసరమా..? నేను అసెంబ్లీ రావాలా..? వద్దా..? మీరే చెప్పండని అన్నారు. నా చావు కోరుతూ పదేపదే స్పీచ్లు ఇస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌ది థర్డ్ క్లాస్ పాలన అని.. రేవంత్ హయాంలో తెలంగాణ రైజింగ్ కాదు.. ఫాలింగ్ కనిపిస్తోందని విమర్శించారు.

# గ్రామ నిధులు నేరుగా సర్పంచులకే అందేలా త్వరలో కొత్త బిల్లు: మంత్రి సీతక్క

మొదటిపేజీ తరువాయి
ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయడమే కాదు ప్రజల్లో నైతిక విలువలను పెంపొందించే దిశగా సర్పంచులు నాయకత్వం వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 9 రకాల ఆదర్శ గ్రామ అంశాలను సర్పంచులు ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. మానసిక ఆరోగ్యం పరిరక్షణ పట్ల సర్పంచులకు అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాజయోగిని బ్రహ్మకుమారి సంతోష్ దీదీ మాట్లాడుతూ.. సర్పంచులు నిస్వార్థంగా ప్రజాసేవ చేయాలని అన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, శాంతి సరోవర్ డైరెక్టర్ కుల్‌దీప్ తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్ హైవేపై ఆల్టో కారు, కాంక్రీట్ టిప్పర్ ఢీ.. పూర్తిగా కాలిపోయిన కారు..

మొదటిపేజీ తరువాయి
తీవ్రంగా గాయపడిన నర్సింహులు భార్య అంజమ్మ, వారి తమ్ముడి కుమారుడు అభిరామ్‌ల పరిస్థితి విషమంగా మారింది. బాధితులను పూడూరు మండలం గొంగుపల్లికి చెందిన ఒకే కుటుంబ సభ్యులుగా గుర్తించారు.
వీరంతా సొంత పనుల నిమిత్తం కోస్గి వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం వికారాబాద్‌కు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

# "పెంపుడు జంతువుల కోసం ఖర్చు చేసే డబ్బు కంటే తక్కువ"

మొదటిపేజీ తరువాయి
ఏడాదిలో తమ పెంపుడు జంతువుల కోసం ఖర్చు చేసే డబ్బు కంటే కంటే కూడా తక్కువగా ఉందని చెప్పారు. ఎక్స్‌లో దీప్కే స్పందిస్తూ.. 590 మందికి పైగా ఆదివాసీ విద్యార్థుల కుటుంబాలకు కేవలం రూ.2 లక్షల చొప్పున పరిహారం మాత్రమే ఇచ్చారని పేర్కొన్నారు.
"కేవలం 2 సంవత్సరాల్లో మహారాష్ట్రలోని ఆశ్రమ పాఠశాలల్లో 590 మందికి పైగా ఆదివాసీ విద్యార్థులు మృతి చెందారు. వారి కుటుంబాలకు కేవలం రూ.2 లక్షల చొప్పున పరిహారం మాత్రమే అందింది" అని దీప్కే పేర్కొన్నారు. విద్యార్థులకు భద్రతను ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని, నిర్లక్ష్యం కారణంగానే వారు మృతి చెందారని దీప్కే ఆరోపించారు.
"వారి భద్రత, సంక్షేమాన్ని ప్రభుత్వం నిర్ధారించడంలో విఫలమైంది. నిర్లక్ష్యం, శ్రద్ధ లేకపోవడం, నిర్వహణ లోపం కారణంగా విద్యార్థులు మృతి చెందినప్పుడు వారి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున అందజేస్తున్నారు. కొంతమంది రాజకీయ నాయకులు ఏడాదిలో తమ పెంపుడు జంతువుల కోసం ఖర్చు చేసే మొత్తం కంటే ఇది తక్కువే కావచ్చు. రాష్ట్రం దృష్టిలో ఆదివాసీ విద్యార్థి జీవితం విలువ ఇంతేనా?" అని ఆయన ప్రశ్నించారు.
ప్రభుత్వ ఉద్యోగాల్లో షెడ్యూల్డ్ ట్రైబ్ అభ్యర్థులను నియమించాలని, గిరిజన పిల్లల కోసం నిర్వహిస్తున్న వసతి పాఠశాలల పరిస్థితులను మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ గిరిజన విద్యార్థులు నిరసనలు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దీప్కే ఈ వ్యాఖ్యలు చేశారు.
గడ్చిరోలి జిల్లాలోని ఒక వసతి పాఠశాలలో పాముకాటుకు గురై ముగ్గురు గిరిజన బాలికలు మృతి చెందిన ఘటన తర్వాత పుణె, నాగ్‌పూర్, నాసిక్‌లలో నిరసనలు ప్రారంభమయ్యాయి. గిరిజన వసతి గృహాల్లో ఉంటూ, గిరిజన వసతి పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి రూ.10 కోట్ల బీమా కవరేజీ కల్పించాలని కూడా నిరసనకారులు డిమాండ్ చేశారు.

# తెలంగాణలో 369 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు టెండర్లు



రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని మరింత వేగవంతం చేయడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ మౌలిక వసతులను భారీగా విస్తరించేందుకు తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీ రెడ్కో) కీలక చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా మొత్తం 369 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, నిర్వహణ, అప్‌గ్రేడేషన్, వాణిజ్య నిర్వహణ కోసం ప్రైవేట్ ఛార్జ్ పాయింట్ ఆపరేటర్ల (సీపీఓలు) కోసం టెండర్లు ఆహ్వానించింది. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వాటికి అనుగుణంగా పబ్లిక్ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను విస్తరించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.
పెరుగుతున్న ఈవీ మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ రంగం ఈ అవకాశాలను అందిపుచ్చుకునేలా ఈవీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని రెడ్కో వీసీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ పేర్కొన్నారు. హైదరాబాద్ పరిధిలో గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరిలోని పలు ప్రాంతాలను కవర్ చేస్తూ రెడ్కో సంస్థ ఏర్పాటు చేసిన 200 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఆరు క్లస్టర్లుగా అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన సీపీవోలు వీటి ఆపరేషన్, మెయింటెనెన్స్, అప్‌గ్రేడేషన్, వాణిజ్య నిర్వహణ బాధ్యతలను చేపడతారని, ప్రాజెక్టు కాంట్రాక్ట్ కాలం 10 సంవత్సరాలు ఉంటుందన్నారు. టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లోని 16 ప్రాంతాల్లోనూ 169 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు.
రెండు ప్రాజెక్టుల్లోనూ వినియోగదారుల కోసం ఈవీ ఛార్జింగ్ టారిఫ్‌ను యూనిట్‌కు రూ.13 (+జీఎస్టీ అదనం)గా నిర్ణయించామన్నారు. కాంట్రాక్ట్ కాలం మొత్తం ఇదే టారిఫ్ అమల్లో ఉంటుంది అని ఆయన స్పష్టం చేశారు. 169 ఛార్జింగ్ స్టేషన్ల ప్రాజెక్టుకు సెప్టెంబర్ 7న ఉదయం 11.30 గంటలకు, 200 ఛార్జింగ్ స్టేషన్ల ప్రాజెక్టుకు అదే రోజు ఉదయం 11 గంటలకు ప్రీ-బిడ్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. బిడ్ల సమర్పణ ప్రక్రియ సెప్టెంబర్ 8 నుంచి ప్రారంభమై సెప్టెంబర్ 22న ముగుస్తుందన్నారు. టెండర్లను తెలంగాణ ఈ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా సమర్పించాలని చెప్పారు.

# బీఆర్ఎస్ వైఖరి మారకపోతే.. మరో పదేళ్లూ రోడ్లపైనే: మంత్రి శ్రీధర్ బాబు

మొదటిపేజీ తరువాయి
భారత రాష్ట్ర సమితి నేతలతో రోడ్లపై మాట్లాడించడం కాదు.. అసెంబ్లీకి వస్తే సమాధానం చెప్తామని తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. పదేళ్లు సీఎంగా పనిచేసిన కేసీఆర్ సభకు వచ్చి.. వారి అనుభవాన్ని పంచుకోవాలన్నారు. ఇందిరాపార్క్ వద్ద పీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్‌తో పాటు ముఖ్యనేతలు జగ్గారెడ్డి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జవాబుదారీతనంతో పని చేస్తోందన్నారు.
"విపక్షాలు సోషల్ మీడియాలో చేస్తున్న విష ప్రచారాలను తిప్పికొట్టాలి. ఆర్టీసీ బస్సుల్లో కాంగ్రెస్ కార్యకర్తలు మాత్రమే ఉచిత ప్రయాణం చేస్తున్నారా? పేదల ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. రాష్ట్రంలో పేదలకు రేషన్ కార్డు కూడా ఇవ్వకుండానే దౌర్భాగ్య పాలన పదేళ్లపాటు సాగింది. బీఆర్ఎస్, భాజపా కార్యకర్తలకు రేషన్ కార్డు రాలేదా? సన్నబియ్యం తీసుకోవట్లేదా? రెండున్నరేళ్లలోనే రైతుల ఖాతాల్లోకి రూ. 1.60 లక్షల కోట్లు జమచేశాం. మళ్లీ ఎన్నికలకు వెళ్లేలోపు.. ఆరు గ్యారంటీలను సంపూర్ణంగా అమలు చేస్తాం. రూ. 8 లక్షల కోట్ల అప్పు ఉన్న రాష్ట్రాన్ని కేసీఆర్ మాకు అప్పగించారు. ఆ అప్పుపై అసలు, వడ్డీ చెల్లిస్తూ.. సంక్షేమం కూడా అమలు చేస్తున్నాం. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్కసారి కూడా గ్రేడ్ 1 నియామకాలు జరగలేదు. ఇకనైనా బీఆర్ఎస్ నాయకుడి వైఖరి మారకుంటే.. మరో పదేళ్లు కూడా వాళ్లు రోడ్ల మీదనే ఉంటారు" అని శ్రీధర్ బాబు అన్నారు.

## ప్రతిపక్ష నేత హోదాకు
# కేసీఆర్ న్యాయం చేయాలి

మొదటిపేజీ తరువాయి
ప్రజలు ప్రతిపక్ష పాత్ర పోషిస్తుంటే.. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. ప్రజా తీర్పును అపహాస్యం చేయొద్దని.. అసెంబ్లీకి రాకపోతే ప్రతిపక్ష నేత పదవిని మరొకరికి అప్పగించాలని హితవు పలికారు.
"నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ ప్రజలు పోరాడి స్వరాష్ట్రం సాధించుకున్నారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక అవి కేవలం కేసీఆర్ కుటుంబానికే దక్కాయి. ఉన్నత చదువులు చదివితే సరిపోదు.. సంస్కారం కూడా ఉండాలని కేటీఆర్ గ్రహించాలి. ఉద్యమకారుల కుటుంబాలకు న్యాయం చేస్తున్నాం. సీఎం రేవంత్‌రెడ్డి కృషితో హైదరాబాద్ రూపురేఖలు మారుతున్నాయి. నగరానికి అనుబంధంగా ఫ్యూచర్‌సిటీ మరో గొప్ప నగరంగా ఎదుగుతోంది. సొంతిల్లు కట్టుకోవాలనే పేదల కల.. పదేళ్లపాటు నెరవేరలేదు. ప్రతి నియోజకవర్గానికీ 2,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నాం. అర్హులైన ప్రతి పేదవాడికీ ఇల్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం. ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ సంక్షేమాన్ని కొనసాగిస్తున్నాం. ప్రభుత్వ విద్య, వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్నాం"అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

# "మా అమ్మ ఏం తప్పు చేసింది?"

మొదటిపేజీ తరువాయి
నేను మాట్లాడిన మాటల్లో తప్పులేదని ఇప్పటికీ చెప్తున్నాను. ఒకవేళ తప్పు ఉన్నా కూడా, నా తప్పు కాబట్టి నామీద అక్రమ కేసు పెట్టి నన్ను జైల్లో వేయాల్సింది.. కానీ మా అమ్మను ఎందుకు అవమానించారని ప్రశ్నించారు.
ఒక సామాన్య కార్యకర్త నుంచి మంత్రి స్థాయికి ఎదిగిన మహిళపై రేవంత్ రెడ్డి ఇంత పగ పెట్టుకుంటాడని అనుకోలేదని అన్నారు. తాను పార్టీని ఎక్కడ కించపరచలేదని.. కేవలం ఒక వ్యక్తి గురించి మాత్రమే మాట్లాడానని అన్నారు. తన తల్లి చేసిన ఒక్క తప్పు చూపించండి.. తన శాఖలో చిన్న అవినీతి కూడా జరగలేదని అన్నారు.
రేవంత్ రెడ్డిని తిట్టమని మా అమ్మ, అతని సహచర మంత్రి ఎందుకు చెప్తుంది? ఎమ్మెల్సీ కోసం ప్రయత్నిస్తున్న మా నాన్న రేవంత్ రెడ్డిని తిట్టమని ఎందుకు చెప్తాడు? అధిష్టానం మొత్తం మా అమ్మకే మద్దతుగా ఉంది.. కానీ రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ చేయడం వల్లనే అధిష్టానం ఈ నిర్ణయం తీసుకుందని ఆరోపించారు. ప్రభుత్వనిర్ణయాలు తెలుసుకోండి రేవంత్ రెడ్డి సోదరుల అక్రమాల చిట్టా తన దగ్గర ఉందని.. దాని గురించి తర్వాత మాట్లాడతానని అన్నారు. మా అమ్మ, నాన్న కాంగ్రెస్ పార్టీలోనే ఉంటారు.. మా అమ్మను ఇంత అవమానిస్తారని తెలిస్తే అలా మాట్లాడేదాన్ని కాదు.. అంటూ భావోద్వేగానికి గురయ్యారు.

# అంబేద్కర్ సాంస్కృతిక కేంద్రానికి శంకుస్థాపన

మొదటిపేజీ తరువాయి
చేసిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి.. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సాంస్కృతిక కేంద్రం నిర్మాణం చేయాలనుకోవడంపై నిర్వాహకులను అభినందించారు. నగరపర్యటనలను అన్వేషించండి
ఎక్కడ అణిచివేత జరిగితే అక్కడ అంబేద్కర్ ఉండేవారని.. ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఈ అంబేద్కర్ కళా భవనం ఏర్పాటు చేయడం చాలా ఉపయోగకరమని అన్నారు. ఏం ఫండ్స్ కావాలన్నా సహాయ సహకారం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీకి అభినందనలు తెలిపారు.
రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేట్‌లోని సైబర్ మెడోస్ వెంచర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి వివేక్ తో పాటు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తదితర నేతలు పాల్గొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలు, సామాజిక సమానత్వం, విద్య, కళలు, సాంస్కృతిక విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో ఈ సాంస్కృతిక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శంకుస్థాపన కార్యక్రమానికి కళాకారులు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు.

# నాపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్‌ను అరెస్ట్ చేయాలి: కవిత

మొదటిపేజీ తరువాయి
సామాజిక మాధ్యమాల్లో తనపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన చేసిన కానిస్టేబుల్‌ను సర్వీస్ నుంచి రిమూవ్ చేయకుండా రాష్ట్ర డీజీపీ సస్పెండ్‌తోనే సరిపెట్టారని తెలంగాణ రక్షణసేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. అతడిపై కేసు పెట్టి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే చర్యలు చేపట్టకుంటే.. అంతర్జాతీయ వేదికలపై ప్రభుత్వం తీరును ఎండగడతానని హెచ్చరించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణసేన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడారు. మహిళలపై అసభ్యంగా మాట్లాడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు చెబుతున్నాయని, అవి డీజీపీకి తెలియదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా.. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు కల్లలు గానే మిగిలిపోయాయన్నారు. బీసీల కోసం ధర్నాలు చేస్తామని కాంగ్రెస్ నేతలు చెప్పడం పెద్ద జోక్ అని కవిత అన్నారు. 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆక్షేపించారు. మాజీ మంత్రి కొండా సురేఖ అంశం ఆ పార్టీ అంతర్గత విషయమన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం సెప్టెంబర్ 07, 2026

# భారత దేశాన్ని 300 ఏళ్లు పాలించిన
# ముస్లిం రాజులు మక్కాకు ఎందుకు వెళ్ళలేదు?

**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

బాబర్ నుండి ఔరంగజేబు వరకు భారతదేశాన్ని దాదాపు 300 ఏళ్లు పాలించి, తమను తాము ఇస్లాం రక్షకులుగా చెప్పుకున్న మొఘల్ రాజులు ఇస్లాంలో అత్యంత పవిత్రమైన హజ్ యాత్రకు ఎందుకు వెళ్లలేదు?.

- ఒట్టోమన్ సామ్రాజ్యంతో వైరం కారణం

**మక్కాపై ఒట్టోమన్ల నియంత్రణ**

- **1517లో ఒట్టోమన్ సుల్తాన్ 'సలీమ్-1' మక్కా, మదీనాలు ఉన్న హిజాజ్ ప్రాంతాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకుని, ప్రపంచ సున్నీ ముస్లింలందరికీ తానే 'ఖలీఫా' గా ముస్లింల అత్యున్నత నాయకుడిగా ప్రకటించుకున్నాడు. మక్కా మదీనా లు ఒట్టోమన్ రాజుల ఆధీనంలో ఉండేవి.**

**ప్రోటోకాల్ మరియు అహంకారం**

- మొఘల్ చక్రవర్తి అక్బర్ తనను తాను తన కాలపు ఖలీఫాగా (ఖలీఫా-ఉద్-జమాన్) భావించేవాడు.ఒకవేళ అక్బర్ లేదా మరే ఇతర మొఘల్ రాజు మక్కాకు వెళ్తే, అక్కడ ఒట్టోమన్ సుల్తాన్ నియమాలకు లోబడి, ఒక లొంగిపోయిన రాజులా లేదా అతిథిలా తలవంచాల్సి వచ్చేది.

**భారతదేశ సంపదతో ప్రపంచంలోనే అత్యంత సంపన్న చక్రవర్తులుగా మారిన మొఘలులు తమ అహాన్ని పక్కనపెట్టి, సామంత రాజులా ఒట్టోమన్ రాజుకు లొంగిపోవడానికి ఇష్టపడలేదు.**

- అంతర్గత తిరుగుబాట్ల వల్ల సింహాసనాన్ని కోల్పోతామన్న భయం

- **ముస్లిం రాజులు అయి ఉండి మక్కా దర్శనానికి వెళ్లకపోతే అది దైవ ధిక్కరణ అని ప్రజలు భావించే అవకాశం ఉందని మొగల్ రాజులు ఇస్లాం న్యాయ శాస్త్రాన్ని వెతికి వెతికి ఒక వెసులుబాటు కనుక్కున్నారు.**

మస్లాహా సూత్రం
మక్కా వెళ్లకుంటే ప్రజలు ప్రశ్నిస్తారనే భయంతో మొఘలులు ఇస్లామిక్ న్యాయశాస్త్రంలోని 'మస్లాహా' అనే నిబంధనను వాడుకున్నారు.
దీని ప్రకారం... ఒక రాజు తన రాజ్యాన్ని విడిచిపెట్టి వెళ్లడం వల్ల అక్కడ తిరుగుబాట్లు వచ్చే అవకాశం ఉంటే, అతను వ్యక్తిగతంగా హజ్ యాత్ర చేయాల్సిన అవసరం లేదు.

**సుదీర్ఘ ప్రయాణం**

- **ఆ రోజుల్లో మక్కాకు వెళ్లి రావడానికి నెలలు లేదా సంవత్సరాలు పట్టేది.మొఘల్ రాజదర్బార్ ఎప్పుడూ కుట్రలతో కూడి ఉండేది. ఉదాహరణకు అక్బర్‌పై జహంగీర్, జహంగీర్‌పై షాజహాన్ తిరుగుబాటు చేయడం. రాజు అంత కాలం రాజధానికి దూరంగా ఉంటే, వెనుక ఎవరో ఒకరు సింహాసనాన్ని ఆక్రమించే ప్రమాదం ఉంది కాబట్టి మొఘల్ రాజులు ఆ రిస్క్ తీసుకోలేదు.**

ఆశ్చర్యకరంగా, మక్కా మదీనా ఉన్న హిజాజ్ ప్రాంతాన్ని పాలించిన 36 మంది ఒట్టోమన్ సుల్తానులలో కూడా ఒక్కరు కూడా హజ్ యాత్ర చేయలేదు.

- ప్రయాణ మార్గాల్లోని ప్రమాదాలు

భారత్ నుండి మక్కా వెళ్లడానికి రెండు మార్గాలు ఉండేవి.. భూమార్గం, సముద్ర మార్గం.

**భూమార్గం**
ఇది ఇరాన్‌లోని షియా సఫవీ సామ్రాజ్యం గుండా వెళ్లేది . మొఘలులు కట్టర్ సున్నీలు, ఇరాన్ పాలకులు సఫవీలు, కట్టర్ షియాలు అవ్వడం వల్ల మరియు వారి మధ్య కందహార్ సరిహద్దు వివాదాలు ఉండడం వల్ల శత్రు దేశం గుండా వెళ్లడం ఆత్మహత్యతో సమానమని భావించారు.

**సముద్ర మార్గం**
గుజరాత్‌లోని సూరత్ పోర్ట్ నుండి అరేబియా సముద్రం మీదుగా వెళ్లే ఈ మార్గం పూర్తిగా మొగలుల శత్రు పాలకులైన పోర్చుగీసుల ఆధీనంలో ఉండేది.
బలహీనమైన నౌకాదళం

- **పోర్చుగీసుల కార్తాజ్ విధానం**

పోర్చుగీసుల అనుమతి పత్రం (కార్తాజ్) లేనిదే మొఘల్ ఓడలు కూడా సముద్రంలోకి వెళ్లేవి కావు.ఒకవేళ పర్మిట్ లేకుండా వెళ్లే ఓడలను లూటీ చేసి, ప్రయాణికులను బానిసలుగా మార్చేవారు.

- ఈ పర్మిట్లపై మేరీ మాత, ఏసుక్రీస్తు చిత్రాలు ఉండేవి, ఇవి సున్నీ ముస్లింలకు నచ్చకపోయినా అవమానాన్ని భరిస్తూ వాటిని వాడాల్సి వచ్చేది.

**మొగలులకు నేవీ లేదు**

- **మొఘలులు నౌకాదళం ఎందుకు నిర్మించలేదు?**

ఒట్టోమన్ ల పెద్ద నౌకాదళాన్నే పోర్చుగీసులు ఓడించడం చూసిన అక్బర్, కొత్తగా నేవీని




నిర్మించడం వృథా ఖర్చు అని భావించి, మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లా మురుడ్ తీరంలో అరేబియా సముద్రం మధ్యలో ఉన్న మురుడ్-జంజీరా కోట భద్రతను 'సిద్ది' ఆఫ్రికన్ సంతతి నావికులకి అవుట్‌సోర్స్ ఇచ్చాడు. అంటే డబ్బులిచ్చి కాపలా పెట్టడం చేశాడు.

- **భూమిపై గుర్రాలు, తోపులతో యుద్ధాలు చేయడంలో మొఘలులు దిట్టలు, కానీ సముద్రంపై వారికి పట్టు లేదు.**

## గుల్బదన్ బేగం మక్కా యాత్ర

- **1575లో అక్బర్ ఒక వ్యూహం ప్రకారం తన మేనత్త బాబర్ కుమార్తె అయిన గుల్బదన్ బేగం నాయకత్వంలో మొఘల్ రాజకుటుంబ స్త్రీలను మక్కాకు పంపాడు.**

**ఒకవేళ యువరాజులు వెళ్తే ఒట్టోమన్లు శత్రువుగా చూస్తారు, కానీ మహిళల వల్ల వారికి సింహాసన గండం ఉండదని ఇలా చేశాడు.**

**ఆర్థిక ప్రభావం.. బహిష్కరణ**

- **గుల్బదన్ బేగం మక్కాలో దాదాపు 4 ఏళ్లు ఉండి, అక్బర్ ఇచ్చిన కోట్ల రూపాయల బంగారాన్ని దానం చేసింది. దీనివల్ల అక్కడ విపరీతమైన ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల వచ్చి స్థానిక ప్రజలు ఇబ్బంది పడ్డారు. మొఘలుల ప్రభావం పెరిగిపోతుండడం చూసి తట్టుకోలేని ఒట్టోమన్ సుల్తాన్ మురాద్-3, 1580లో మొఘల్ మహిళలను బలవంతంగా మక్కా నుండి వెళ్లగొట్టాలని ఆదేశించాడు.**

తిరుగు ప్రయాణంలో కూడా ఈ మహిళలను ఒట్టోమన్ గవర్నర్లు బందీలుగా ఉంచి అవమానించారు.

అబుల్ ఫజల్ అబద్ధం
ఈ పెద్ద అవమానాన్ని దాచడానికి అక్బర్ ఆస్థాన చరిత్రకారుడు అబుల్ ఫజల్ తన 'అక్బర్నామా'లో...
ఆ స్త్రీలు అక్బర్‌ను మిస్ అవుతూ సొంతంగానే తిరిగి వచ్చేశారని రాశాడు.

కానీ ఆధునిక చరిత్రకారులు ఇస్తాంబుల్ రికార్డులను పరిశోధించినప్పుడు ఒట్టోమన్ సుల్తాన్ వారిని వెళ్లగొట్టిన అసలు నిజం బయటపడింది.

**అక్బర్ ప్రత్యామ్నాయ వ్యూహం**

- ఈ అవమానం తర్వాత అక్బర్ మక్కాకు ఇచ్చే దానాలను నిలిపివేసి, భారత్‌లోనే అజ్మీర్ షరీఫ్ వంటి సూఫీ దర్గా దర్శనాలను ప్రోత్సహించాడు. మక్కాకు ప్రత్యామ్నాయంగా ఈ సూఫీ దర్గాలను ప్రోత్సహించి ఖలీఫా-ఉద్- జమాన్ అనే తన స్వయం బిరుదుతో అహం తృప్తి పరచుకున్నాడు.

**జహంగీర్ ప్రతీకారం**
1613లో జహంగీర్ తల్లి జోధాబాయి కి చెందిన 'రహీమి' అనే పెద్ద వ్యాపార ఓడను పోర్చుగీసులు హైజాక్ చేసినప్పుడు, జహంగీర్ నేరుగా యుద్ధం చేయకుండా, భూమిపై ఉన్న పోర్చుగీస్ గోదాములను, చర్చీలను మూసివేయించి వారిని మోకాళ్లపైకి తెచ్చి నష్టపరిహారం వసూలు చేశాడు.

**ఔరంగజేబు నిర్ణయం**
ఔరంగజేబు ప్రారంభంలో మక్కాకు భారీగా డబ్బు పంపినప్పటికీ, అక్కడి పాలకులు మరింత డబ్బు కోసం ఆశపడడంతో, మక్కాకు నిధుల పంపిణీ ఆపివేశాడు.
ఖురాన్‌లోని సూరా ఆలి ఇమ్రాన్ 3:97 లో చెప్పిన దాని ప్రకారం ప్రతి ముస్లిం విధిగా మక్కాకు వెళ్లాలి.

అయితే, దీనికి ఒక ముఖ్యమైన మినహాయింపు కూడా ఉంది. శారీరక శక్తి మరియు ఆర్థిక స్తోమత ఉన్నవారికి మాత్రమే ఈ నిబంధన వర్తిస్తుంది. ఖురాన్ ఆదేశాన్ని తప్పించుకోవడానికి మొఘల్ రాజులు ఖురాన్ లోని 'మస్లాహా' అనే నిబంధనను వాడుకున్నారు.

వారి పాలనా సమయంలో మొఘలులు నేవీని నిర్మించకపోవడం ఆర్థికంగా సరైన నిర్ణయం అనిపించినా, సుదూర భవిష్యత్తులో అదే వారి అతిపెద్ద చారిత్రక తప్పిదంగా మారింది.

- **భూమిపై తిరుగులేని పాలన సాగించిన మొఘలులు, సముద్ర మార్గాలపై పట్టు సాధించిన యూరోపియన్ల చేతిలో చివరకు తమ సొంత మహళ్లలోనే ఖైదీలుగా మారి పోయిన పరిస్థితి ఎదుర్కొన్నారు.**

అతి క్రూరమైన అంతులేని హింసతో, నీతిలేని యుద్ధాలతో భారతదేశంలో పాలనను చేతిలోకి తీసుకోగలిగిన ముస్లిం రాజులు మక్కాకు వెళ్లలేకపోవడం ఆ దేవుడి శాపమేమో!

- **భారతదేశాన్ని 300 ఏళ్ళు పాలించిన ముస్లిం రాజులు మొగలులు మక్కా ను దర్శించలేకపోవడం ఏమిటో మరి?**

మక్కా దర్శనానికి (హజ్ యాత్రకు) వెళ్లాలనే కోరికతో మరియు తన సొంత ఖర్చుల కోసం స్వయంగా టోపీలు కుట్టి డబ్బు సంపాదించుకున్న మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు తన జీవితకాలంలో మక్కాను దర్శించలేకపోయాడు.

- **హజ్ యాత్ర చేయలేకపోయిన ముస్లిం మొఘల్ రాజులు అల్లా కృపకు నోచుకోలేకపోయారని చరిత్రకారులు వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తుంటారు.**

భారతదేశాన్ని 300 ఏళ్లు పాలించిన ముస్లిం రాజులు ఒక్కరు కూడా మక్కాను దర్శించలేక పోయారు.

## జాతి జనగణనలో ఓబీసీ కాలమ్ తప్పనిసరి: బీసీ సంఘాల డిమాండ్

- **11న హనుమకొండ ఏకశిలా పార్క్ వద్ద నిరసన దీక్షకు పిలుపు**

**కరపత్రం ప్రతినిధి హనుమకొండ, సెప్టెంబర్ 6**
జాతీయ జనగణనలో ఇతర వెనుకబడిన వర్గాల (ఓబీసీ) కోసం ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేసి, బీసీల జనాభా లెక్కలను తప్పనిసరిగా నమోదు చేయాలని బీసీ సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కాకతీయ విశ్వవిద్యాలయం జాఫర్ నిజాం హాల్‌లో బీసీ కులగణన సాధన సమితి కన్వీనర్, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కె. మురళి మనోహర్ అధ్యక్షతన బీసీ సంఘాల ముఖ్య నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి



మనోహర్ మాట్లాడుతూ.. త్వరలో చేపట్టనున్న జాతీయ జనగణనలో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ లేకపోతే విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి కీలక రంగాల్లో బీసీలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. జనాభా నిష్పత్తి ఆధారంగా బడ్జెట్ కేటాయింపులు, విద్యా అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం నిర్ణయించాలంటే ఖచ్చితమైన జనాభా గణాంకాలు అవసరమని పేర్కొన్నారు. జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీ వర్గాల ఆకాంక్షలను కేంద్ర ప్రభుత్వం గౌరవించి, జనగణన ఫారంలో ప్రత్యేకంగా ఓబీసీ కాలమ్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ డిమాండ్ సాధన కోసం సెప్టెంబర్ 11న హనుమకొండలోని ఏకశిలా పార్క్ (జయశంకర్ పార్క్) వద్ద ప్రత్యేక నిరసన దీక్ష నిర్వహించాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీ వర్గాల ప్రజలు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తిరునాహరి శేషు, వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, తాడిశెట్టి క్రాంతికుమార్, డా. సంగాని మల్లేశ్వర్, సాయిని నరేందర్, గొల్లపల్లి వీరస్వామి, చింతం ప్రవీణ్ కుమార్, రాజకొండ ప్రవీణ్, జనార్దన్, కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాంలో కలెక్టర్ తనిఖీ

- **వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**కరపత్రం ప్రతినిధి వరంగల్,సెప్టెంబర్ 6**
ఎనుమాముల మార్కెట్ యార్డులోని ఈవీఎం గోదాంను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదివారం త్రైమాసిక తనిఖీలో భాగంగా పరిశీలించారు.గోదాంలోని భద్రతా ఏర్పాట్లు,నిర్వహణ విధానం,రికార్డుల నిర్వహణను ఆమె సమీక్షించారు.ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి లోపాలకు తావులేకుండా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు.గోదాం భద్రత,పర్యవేక్షణకు సంబంధించిన ఏర్పాట్లను నిరంతరం పరిశీలించాలని ఆదేశించారు.ఈ తనిఖీలో డీఆర్వో విజయలక్ష్మి,వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు టీడీపీకి చెందిన శ్యామ్ సుందర్,ఎంఐఎంకు చెందిన సయ్యద్ ఫైజుల్లా,వైఎస్సార్‌సీపీకి చెందిన రజనీకాంత్,బీఎస్పీకి చెందిన అనీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 'సస్పెన్షన్ కాదు.. అరెస్ట్ చేయాలి'

- డీజీపీ తీరుపై తీవ్ర విమర్శలు..
- అసెంబ్లీలోనే ఉద్యమకారులకు గడువుతో హామీ ఇవ్వాలని డిమాండ్

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, సెప్టెంబర్ 6**
రాష్ట్ర డీజీపీ వ్యవహార శైలిపై తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తనపై సోషల్ మీడియాలో అసభ్యకర వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్‌ను కేవలం సస్పెండ్ చేయడం సరిపోదని, వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. మహిళల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలపై చట్టం కఠినంగా ఉన్నప్పటికీ, పోలీసు శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన టిఆర్ఎస్ పార్టీ చీఫ్ కవిత, చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసు వ్యవస్థే బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే సాధారణ మహిళలకు రక్షణ ఎలా లభిస్తుందని ప్రశ్నించారు. డీజీపీ చట్టాలను సమానంగా అమలు చేయాలని, లేకుంటే ఈ అంశాన్ని జాతీయ, అంతర్జాతీయ



వేదికల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో గంజాయి అక్రమ రవాణా, పెరుగుతున్న నేరాలపై ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. హేట్ స్పీచ్ నియంత్రణకు ప్రభుత్వం ప్రకటించిన బిల్లును ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని కవిత ఆరోపించారు. అధికారంలోకి రావడానికి ఉద్యమకారులను వినియోగించుకుని, అనంతరం వారిని పట్టించుకోలేదని విమర్శించారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి నిర్ణీత కాలవ్యవధితో కూడిన స్పష్టమైన హామీని ముఖ్యమంత్రి ఈ అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేకే కమిటీ పేరుతో కాలయాపన చేయకుండా, ఉద్యమకారుల సంక్షేమంపై తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నేతల పర్యటనలను అడ్డుకుంటామని హెచ్చరించారు.
బీసీ రిజర్వేషన్ల విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కవిత విమర్శలు గుప్పించారు. బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇప్పుడు కేంద్రంపై ఆందోళనలు చేస్తామని చెప్పడం రాజకీయ నాటకమని వ్యాఖ్యానించారు. కులగణనలో పూర్తి స్థాయిలో కులాల వారీ వివరాలు నమోదు చేయాలని తమ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు.
అసెంబ్లీ ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక కావాల్సిన సమయంలో రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలకే పరిమితమవుతోందని కవిత విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపైనే ప్రభుత్వం దృష్టి పెట్టాలని పార్టీ చీఫ్ కవిత సూచించారు.

## అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించి, భరోసా కల్పించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, సెప్టెంబర్ 6**
స్టేషన్ ఘనపూర్ మండలం రాఘవపురం గ్రామంలో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన స్థలాన్ని ఆదివారం మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరిశీలించారు.?ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో పిల్లల విద్యా సర్టిఫికెట్లు, బట్టలు, నిత్యవసరాలు, నగదు పూర్తిగా కాలిపోయాయని బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే ఎదుట కన్నీటిపర్యంతమయ్యారు. దీంతో స్పందించిన కడియం శ్రీహరి బాధిత కుటుంబాన్ని ఓదార్చి, అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. తక్షణ సహాయంగా ఆర్థిక సాయం అందించడంతో పాటు, ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి 50 సిమెంట్ బస్తాలు వెంటనే ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ద్వారా ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా కల్పించారు. ?అలాగే, గ్రామంలో అసంపూర్తిగా ఉన్న ఎస్సీ (మాల) కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 15 రోజుల్లో నిధులు మంజూరు చేయిస్తానని, 3నెలల్లో నిర్మాణం పూర్తి చేసే విధంగా నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జూలూకుంట్ల శిరీష్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక

సోమవారం సెప్టెంబర్ 07, 2026

# జ్ఞానమే నా ఆయుధం

- డాక్టర్ బి ఆర్ అంబెద్కర్ లాగా విద్యే నా లక్ష్యం
- మహనీయుల జ్ఞాన మాల కార్యక్రమం లో
- పాడుగుల రోషిని స్వేరో

**కరపత్రం ప్రతినిది సెప్టెంబర్ 6,మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా.**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కీసర సర్కిల్, దమ్మాయి గూడ డివిజన్, రాజీవ్ గృహ కల్ప కాలనీ లోని

చైతన్య భూమి వద్ద మాల సంక్షేమ సంఘం పొలామూరి వినాయకరావు అధ్యక్ష తన 235౦35 మరియు జ్ఞాన కేంద్రంలోని డాక్టర్ బి ఆర్ అంబెద్కర్ సంఘం అధ్యక్షులు డాక్టర్ గోల్లూరి రాజు అధ్యక్షతన జరిగిన 32 వ పూలమాల కార్యక్రమలకు ముఖ్య అతిధిగా పాడుగుల రోషిని స్వేరో హాజరై ఆ మహనీయులకు పూల మాలలువేసి ఘనంగా నివాళు లు అర్పించారు ఈ సందర్భంగా అంబెద్కర్ సంఘం గౌరవ అధ్యక్షులు మంగళ పూరి వెంకటేష్ (మాజీ కౌన్సిలర్), అంబెద్కర్ సంఘం అధ్యక్షులు ప్రజ డాక్టర్ గోల్లూరి రాజు, పొలామూరి వినాయక రావు లు మాట్లాడుతూ పాడుగుల రోషిని నిరుపేద కుటుంబం నుంచి విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యశించడం మనకు ఎంతో గర్వాంగా ఉంది అన్నారు, ఎస్ సంపత్, నామడి రాజా, ప్రభాకర్ లు



పూల మొక్కలను బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు, అనంతరం ఆమె మాట్లాడుతూ నేను ఈ రోజు నా జీవితంలో ఒక ముఖ్యమైన విజయాన్ని సాధించను. ఈ స్థాయికి రావడానికి నా తల్లిదండ్రులు చేసిన కష్టం, త్యాగం, ప్రోత్సాహం ఎంతో గొప్పవి. వారి అచంచలమైన సహకారం లేకుండా నా కలలను సాకారం చేసుకోవడం సాధ్యమయ్యేది కాదు.

నా తల్లిదండ్రులు తమ సౌకర్యాలను త్యజించి, నా చదువుకు ప్రాధాన్యత ఇచ్చారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా నా భవిష్యత్తుపై నమ్మకం కోల్పోలేదు. వారి కష్టం, ప్రేమ, ఆశీర్వాదాలే నా విజయానికి పునాది.

విద్య ద్వారా పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థుల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి కృషి చేస్తున్న డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ చూపిన జ్ఞాన మార్గం నాకు ఎంతో స్ఫూర్తినిచ్చింది.గురుకుల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సాహసస్ఫూర్తి పెంపొందించేందుకు స్వేరో కార్యక్రమాన్ని ప్రోత్సహించారు. విద్యార్థులు తమ



సామాజిక నేపథ్యాన్ని అడ్డంకిగా భావించకుండా, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు రూపొందించబడ్డాయి

విద్య అనేది కేవలం ఉద్యోగం కోసం కాదు, మన జీవితాన్ని మార్చుకోవడానికి మరియు సమాజానికి సేవ చేయడానికి ఒక శక్తి అని ఆయన ఆలోచనలు నాకు తెలియజేశాయి. ప్రతికూల పరిస్థితులను అధిగమించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చనే ధైర్యం ఆయన ద్వారా కలిగింది. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆత్మవిశ్వాసం, ప్రపంచస్థాయి అవకాశాలు కల్పించాలనే ఆయన కృషి ప్రశంసనీయం. ఆయన సేవల ద్వారా అనేక లక్షల మంది విద్యార్థులు తమ కలలను నిజం చేసుకుంటున్నారు. అందులో నేను ఉన్నాను.

అలాగే, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నాకు మహోన్నతమైన ఆదర్శం. "విద్య పొందండి, హక్కుల కోసం పోరాడండి, సంఘటితం కండి" అనే ఆయన సందేశం నా ఆలోచనలకు బలాన్నిచ్చింది. ఎన్నో సామాజిక అడ్డంకులను ఎదుర్కొన్నప్పటికీ అంబేద్కర్ ఉన్నత విద్యను అభ్యసించి కొలంబియా విశ్వవిద్యాలయం, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థల్లో చదువుకున్నారు. ఆయన విద్యను సామాజిక విముక్తికి మార్గంగా భావించారు.

ఆ మహనీయుల స్ఫూర్తితో ఆకాశమే హద్దుగా భావించి విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో ముందుకు పోయాను లండన్ లోని టీసైడ్ యూనివర్సిటీ లోడిగ్రీ పట్టా తీసుకున్నాను. విదేశీ విద్య ద్వారా నూతన జ్ఞానం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అంతర్జాతీయ అనుభవం సంపాదించి, భవిష్యత్తులో నా కుటుంబానికి, నా సమాజానికి, నా దేశానికి ఉపయోగపడాలని కోరుకుంటున్నాను.

నా విజయం కేవలం నా వ్యక్తిగత విజయం కాదు. నా తల్లిదండ్రుల త్యాగానికి ఇది ప్రతిఫలం. నన్ను ప్రోత్సహించిన గురువులకు, మార్గనిర్దేశం చేసిన డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ కు, హక్కులు మరియు విద్య విలువను ప్రపంచానికి చాటి చెప్పిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్కు నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

నా ప్రయాణం ఇంకా కొనసాగుతూనే ఉంది. కష్టపడి చదివి, ఉన్నత లక్ష్యాలను సాధించి, మరెంతో మంది




విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలన్నదే నా సంకల్పం అని ఈ నాటి గొప్ప కార్యక్రమాకు వెల్కమ్ పలికిన మాల సంక్షేమ సంఘం మరియు డాక్టర్ బి ఆర్ అంబెద్కర్ సంఘం వారికీ ధన్యవాదములు అని అన్నారు ఈ కార్యక్రమంలో చెన్నయ్య, బత్తుల శ్రీనివాస్, రాదా బాయి,బల్ల ఈశ్వరి గ్యాస్ వెంకటేష్, వెంకటమ్మ, రాధకృష్ణ, బొల్లం పాండు, డి నాగేశ్వరావు, డప్పు రమేష్, దర్శనాల విష్ణు, సాయి రెడ్డి, రాజకుమార్, శ్రీనివాసచారి, రంగయ్య, శేషయ్య, పోతుల వెంకటేష్, ఏ కన్నయ్య, అనిల్ పాల్గొని విజయవంతం చేసినందుకు పాడుగుల రూప చంద్రమౌళి దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన రెడ్‌క్రాస్ ప్రణామ్ సెంటర్



**కరపత్రం ప్రతినిది హనుమకొండ, సెప్టెంబర్ 6**

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని హనుమకొండలోని రెడ్‌క్రాస్ ప్రణామ్ సెంటర్‌లో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కొమురయ్య పెంద్యాల అధ్యక్షత వహించగా, బూర రామచందర్ సంధానకర్తగా వ్యవహరించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ విజయచందర్ రెడ్డి పాల్గొని, తన గురువుల మార్గదర్శకత్వమే వైద్య వృత్తిలో ఎదగడానికి కారణమని పేర్కొంటూ ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. అధ్యక్షుడు కొమురయ్య పెంద్యాల మాట్లాడుతూ.. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశానికి రెండో రాష్ట్రపతిగా, గొప్ప తత్వవేత్తగా, విద్యావేత్తగా చేసిన సేవలను స్మరించారు. ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్యారమ్ డబుల్స్ పోటీల్లో అశోక్ రెడ్డి--వేముల సాంబయ్య జంట విజేతలుగా నిలవగా, బూర రామచందర్--రంగరాజు గోవర్ధన్ జంట రన్నరప్‌గా నిలిచింది. విజేతలకు డాక్టర్ విజయచందర్ రెడ్డి జ్ఞాపికలు అందజేశారు. అలాగే 12 మంది విశ్రాంత ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పి.వి. శ్రీనివాసరావు (విశ్రాంత ఎంఆర్వో), మట్టపల్లి భిక్షపతి (విశ్రాంత ఎక్సైజ్ ఎస్ఐ) రెడ్‌క్రాస్ ప్రణామ్ సెంటర్‌కు క్యారమ్ బోర్డులు, స్టాండ్లు, లైట్లు తదితర సామగ్రిని విరాళంగా అందజేస్తామని ప్రకటించగా, కమిటీ వారిని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపింది.

## కేసీఆర్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ ధర్నా

- రూ.23 కోట్ల ప్రజాధన నష్టం వ్యవహారంపై ఇంద్రపార్క్ వద్ద నిరసన
- బి. హనుమంతరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తల భారీ పాల్గొనిక






**కరపత్రం ప్రతినిది రామంతపూర్ ప్రతినిధి మహేందర్, సెప్టెంబర్ 6**

ప్రజాధనం దుర్వినియోగం చేశారంటూ మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని ఇంద్రపార్క్ ధర్నా చౌక్ వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీ, మాజీ టీపీసీసీ అధ్యక్షుడు, తెలంగాణ ప్రభుత్వ బీసీ సలహాదారు బి. హనుమంతరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో రాష్ట్ర మంత్రులు డి. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ సీనియర్ నేత టి. జగ్గారెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు విడుదల చేసిన పోస్టర్‌లో కేసీఆర్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఒకే రోజు అసెంబ్లీకి హాజరైనందుకు రూ.23 కోట్ల ప్రజాధనం ఖర్చు చేశారని, ప్రజాధనానికి బాధ్యత వహిస్తూ కేసీఆర్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల సొమ్మును వృథా చేసే రాజకీయాలకు ముగింపు పలకాలని, ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించాలని కాంగ్రెస్ నేతలు కోరారు.

ధర్నా సందర్భంగా కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు పఠానీ సూట్లు

- పేద విద్యార్థులకు 60 పఠానీ సూట్లు పంపిణీ

**కరపత్రం ప్రతినిది వరంగల్,సెప్టెంబర్ 6**

ముస్లిం వెల్ఫేర్ సొసైటీ వరంగల్ ఆధ్వర్యంలో పేద,నిరుపేద విద్యార్థులకు పఠానీ సూట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.పెన్షన్‌పురాలోని మదర్సా మదీనతుల్ ఉలూమ్‌కు చెందిన 35 మంది పేద విద్యార్థులకు,మండి బజార్‌లోని మదర్సా అరబియా ఖైరుల్ ఉలూమ్‌కు చెందిన 25 మంది అర్హులైన విద్యార్థులకు పఠానీ సూట్లను పంపిణీ చేశారు.పేద,అర్హులైన విద్యార్థులకు అండగా నిలిచే కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని సొసైటీ ప్రతినిధులు తెలిపారు.వరంగల్‌లోని మరో 12 అరబిక్ మదర్సాలకు చెందిన పేద విద్యార్థులకు కుర్తా,పైజామాలు పంపిణీ చేసేందుకు ప్రతిపాదించినట్లు వెల్లడించారు.కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ వరంగల్ అధ్యక్షుడు మహమ్మద్ సిరాజ్ అహ్మద్,కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ కలీం,ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మిర్జా ఫతా ఉల్లా బేగ్,మదర్సా మదీనతుల్ ఉలూమ్ పెన్షన్‌పురా కార్యదర్శి మహమ్మద్ జాఫర్,మదర్సా ఖైరుల్ ఉలూమ్ నాజిమ్ ఖ్వాజా జాఫర్ ఉల్ అభిదీన్,ఉపాధ్యాయుడు ఖ్వాజా



పాషా తదితరులు పాల్గొన్నారు.విస్తృతంగా సంక్షేమ కార్యక్రమాలు

ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పేదలు,నిరుపేదలు,అర్హులైన వారికి అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రతి నెల 516 మంది వితంతువులకు పింఛన్లు అందించడంతో పాటు పేద రోగులకు వైద్య సహాయం,అర్హులైన విద్యార్థులకు విద్యా సహాయం,ఉర్దూ మీడియం పాఠశాలల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ,పేద బాలికల వివాహాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.రంజాన్ మాసంలో అర్హులైన కుటుంబాలకు రేషన్ ప్యాకేజీల పంపిణీతో పాటు అరబిక్ మదర్సాల్లో చదువుతున్న పేద విద్యార్థులకు పాఠశాల దుస్తులను అందిస్తున్నట్లు తెలిపారు.ఫ్యాషన్



డిజైనింగ్,బ్యూటీషియన్ శిక్షణ కార్యక్రమాలతో పాటు పేద విద్యార్థినుల కోసం గర్ల్స్ హాస్టల్ సదుపాయాన్ని కూడా సొసైటీ కల్పిస్తోందన్నారు.సొసైటీ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించేందుకు దాతలు,సేవాభావం కలిగిన వ్యక్తులు ఉదారంగా ఆర్థిక సహకారం అందించాలని నిర్వాహకులు కోరారు.సహాయం,ఇతర వివరాల కోసం 9849325271,9849449486 నంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## కొడంగల్‌పై కవిత ఫోకస్.. 23న కోస్గిలో 'పాంచజన్య సంకల్ప సభ'

- సభ పోస్టర్ ఆవిష్కరణ..
- కాంగ్రెస్ హామీలపై తీవ్ర విమర్శలు
- బీజేపీ కొడంగల్ ఇన్‌చార్జి ప్రభాకర్ కులకర్ణి తెలంగాణ రక్షణ సేనలో చేరిక

**కరపత్రం ప్రతినిది బ్యూరో, సెప్టెంబర్ 6**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గంపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత కల్వకుంట్ల కవిత ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నెల 23న కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో నిర్వహించనున్న 'పాంచజన్య సంకల్ప సభ' పోస్టర్‌ను ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ చీఫ్ కవిత మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను ఆకర్షించిన కాంగ్రెస్ ప్రభుత్వం, వాటిలో సగం హామీలను కూడా అమలు చేయలేదని విమర్శించారు. ప్రజలను బూటకపు హామీలతో మోసం చేసిన కాంగ్రెస్




ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొడంగల్ నుంచే 'పాంచజన్య శంఖారావం' ప్రారంభిస్తున్నామని తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేనకు ప్రజలు అవకాశం కల్పిస్తే ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించడంతో పాటు పార్టీ ప్రకటించే 'పాంచజన్య'లోని ప్రతి హామీని నూటికి నూరు శాతం అమలు చేస్తామని హామీ ఇచ్చారు. యువత, మహిళలు, సబ్బండ వర్గాల సాధికారతే లక్ష్యంగా బహుజన తెలంగాణ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.



- టీఆర్ఎస్‌లోకి బీజేపీ కొడంగల్ ఇన్‌చార్జి

ఈ సందర్భంగా బీజేపీ కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రభాకర్ కులకర్ణి తెలంగాణ రక్షణ సేనలో చేరారు. పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత ఆయనతో పాటు అనుచరులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ కులకర్ణి మాట్లాడుతూ.. కవిత నాయకత్వంలో బహుజన తెలంగాణ సాధనే లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేనలో చేరుతున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అర్చనా సేనాపతి, గవినోళ్ల శ్రీనివాస్, సయ్యద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు

## రవీంద్రభారతిలో అంగరంగ వైభవంగా మహా గురువుల గురుపూజోత్సవం

- ఆర్కే కళా సంస్కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘన కార్యక్రమం
- ఆధ్యాత్మిక గురువు ఆచార్య తిరునగరి వెంకటేశ్వర స్వామికి ఘన సన్మానం

**కరపత్రం ప్రతినిది హైదరాబాద్, సెప్టెంబర్ 6**

ఆర్కే కళా సంస్కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహా గురువుల గురుపూజోత్సవ కార్యక్రమం ఆదివారం రవీంద్రభారతి వేదికగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మిక గురువు ఆచార్య తిరునగరి వెంకటేశ్వర స్వామిని ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న పుల్లేటికుర్తి సంజయ్, వ్యాగ్రా లక్ష్మీ, విశ్వనాథ, నాగేంద్ర కుమార్ తదితరులు మాట్లాడుతూ.. తిరునగరి వెంకటేశ్వర స్వామి గురుముఖంగా తాము తీసుకున్న ఆధ్యాత్మిక సాధనను 41 రోజులపాటు నమ్మకంతో కొనసాగించామని తెలిపారు. ఆ సాధన ద్వారా తమకు అద్భుతమైన ఫలితాలు లభించాయని పేర్కొన్నారు. గురువు గురుపూజ మహోత్సవానికి హాజరుకావడం తమకు ఎంతో గర్వంగా ఉందన్నారు.విశ్వహిందూ ఐక్యతే విశ్వశాంతికి మూలం పూజ్య గురువులు తిరునగరి వెంకటేశ్వర స్వామి మాట్లాడుతూ గురుపూజ కార్యక్రమాలు సనాతన సంప్రదాయంలో అఖండ భారతదేశంలో ప్రాచీన కాలం నుంచి నేటి వరకు ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించబడుతున్నాయని అన్నారు.







ధర్మో రక్షతి రక్షితః అనే హిందూ ధర్మ సిద్ధాంతమే దీనికి ప్రధాన కారణమని పేర్కొన్నారు.

భారతదేశం కర్మభూమి, ధర్మభూమి అని, విశ్వహిందూ ఐక్యతే విశ్వశాంతికి మూలమని ఆయన అన్నారు. అఖండ హిందూ సంస్కృతిలోని కట్టు, బొట్టు, ఆచారాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు నేటి యువతను మరింతగా ఆకట్టుకుంటున్నాయని తెలిపారు.నేటి విశ్వహిందూ యువత ఆధ్యాత్మిక తరంగంగా ముందుకు సాగుతోందని, ప్రపంచ దేశాలకు భారతీయ సనాతన సంస్కృతి తలమానికంగా నిలుస్తోందని తిరునగరి వెంకటేశ్వర స్వామి వ్యాఖ్యానించారు.

కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురువులు, కళాకారులు, ఫౌండేషన్ ప్రతినిధులు, భక్తులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.